క్లుప్తంగా

గౌతమ బుద్ధుని విగ్రహావిష్కరణ


బుద్ధుని విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

సోంపేట: విద్యార్థులు ఇష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలు చేరుకోవాలని స్థానిక ఎమ్మెల్యే బి.అశోక్, మాజీ మంత్రి జి.శివాజీ అన్నారు. స్థానిక ఆదర్శ పాఠశాల ఆవరణలో సోంపేట పట్టణానికి చెందిన బీన ఆనంద్ ఆర్థిక సహాయంతో ఏర్పాటు చేసిన గౌతమ బుద్ధుని విగ్రహాన్ని బుధవారం ఆవిష్కరించారు. అనంతరం పాఠశాలలో ల్యాబ్‌ను ప్రారంభించారు. గత విద్యా సంవత్సరంలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చిన్నాజీ వర్మ, నాయకులు సూరాడ చంద్రమోహన్, బీన ఈశ్వరరావు, చిత్రాడ శేఖర్ పాల్గొన్నారు.

డీటీగా శంకరరావు


శంకరరావు

నందిగాం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డీటీగా వాన శంకరరావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన పాతపట్నంలో ఎన్నికల డీటీగా పనిచేసి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇంతవరకు ఇక్కడ పనిచేసిన ఆర్.రామారావు రీసర్వే డీటీగా కొనసాగుతారు. పలువురు వీఆర్వోలు, సిబ్బంది నూతన డీటీకి పుష్పగుచ్ఛాలతో అభినందించారు.

మృతుని కుటుంబానికి పరామర్శ

కంచిలి: కొల్లూరు పంచాయతీ పరిధి సిర్తలి గ్రామానికి చెందిన పైల వెంకటరావు ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి మృతుని కుటుంబ సభ్యులను బుధవారం పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు పైల మోహన్‌రెడ్డి, గణేష్‌రెడ్డి, మాధవరెడ్డి, పాపారావు, ఇప్పిలి సురేష్ ఉన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం


తర్లిపేటలో రోడ్డు పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

టెక్కలి: కోటబొమ్మాళి, సంతబొమ్మాళి మండలాల్లోని పలు గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలను మంత్రి కె.అచ్చెన్నాయుడు బుధవారం ప్రారంభించారు. గత ప్రభుత్వంలో ఎటువంటి గ్రామాల అభివృద్ధి జరగలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పల్లెలకు పూర్వ వైభవం వచ్చిందన్నారు. నాయకులు కె.హరివరప్రసాద్, వి.విజయలక్ష్మి, అధికారులు పాల్గొన్నారు.

కేజీబీవీకి 250 పరుపులు అందజేత

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీలోని కేజీబీవీ విద్యార్థినులకు అవసరమైన పరుపులను స్థానిక రోటరీ క్లబ్ సభ్యులు సమకూర్చారు. విద్యాలయం ఆవరణలో బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ ప్రతినిధులు మాట్లాడుతూ.. స్థానికంగా విద్యార్థినులు నిద్రపోయేందుకు సరైన వసతులు లేకపోవడంతో 250 పరుపులను అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు మాచర్ల రాజ్‌కుమార్, పైడిశెట్టి దినేష్, మోహన్‌వెంకటేష్, ప్రదీప్, పి.తులసీదాస్, డి.కృష్ణమూర్తి, ఎం.నవీన్‌కుమార్, వేదవ్యాస్, శ్యామ్‌కుమార్ పాల్గొన్నారు.

సందడిగా గ్రామ దేవతల ఉత్సవం


కాళీమాత వేషధారణలో కళాకారులు

వజ్రపుకొత్తూరు: పూడిజగన్నాథపురంలో పెద్దమ్మతల్లి, మంకినమ్మ, భూలోకమ్మతల్లి గ్రామ దేవతల ఉత్సవాలు సందడిగా కొనసాగుతున్నాయి. బుధవారం పెద్దమ్మతల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. చెంచు లక్ష్మి, కోబ్రా, జాలరి నృత్య ప్రదర్శనలు అలరించాయి. కాళీమాత, కాంతార నృత్యం, పగటి వేషాలు, చిన్నారుల కోలాట ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

ఇదేం సర్వీస్!

- అస్తవ్యస్తంగా సర్వీసు రోడ్ల నిర్వహణ
- బ్రిడ్జిల కింద భారీ వాహనాల పార్కింగ్‌తో అవస్థలు
- కనీస నిర్వహణ లేనివైనం


కంచిలి బ్రిడ్జి కింద పార్కింగ్ చేసిన భారీ వాహనాలు

కంచిలి:

జాతీయ రహదారులకు అనుబంధంగా కూడళ్ల వద్ద నిర్మించిన సర్వీస్, అప్రోచ్ రోడ్లు, బ్రిడ్జిల కింద నిర్వహణ అస్తవ్యస్తంగా ఉంది. సర్వీసు రోడ్ల నిర్మాణం చేపట్టిన తర్వాత ఎప్పటికప్పుడు వాటి పరిసరాల్లో నిర్వహణ పనులు చేపట్టడం లేదు. కనీస స్థాయిలో కూడా వీటి పరిసరాల్లో శుభ్రం చేయడం, లైటింగ్ నిర్వహణ, ట్రాఫిక్ నియంత్రణపై సంబంధిత అధికారులు దృష్టి సారించడం లేదు. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇచ్ఛాపురం నియోజకవర్గం పరిధిలోని వివిధ కూడళ్ల వద్ద ఏర్పాటు చేసిన సర్వీస్, అప్రోచ్ రోడ్ల నిర్వహణ దారుణంగా ఉంది. ప్రధాన రహదారి నుంచి అప్రోచ్ రోడ్డు మార్గాలను సరిగ్గా కలపకపోవడంతో వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. మండల కేంద్రం కంచిలి పట్టణంలోకి జాతీయ రహదారి నుంచి వచ్చేందుకు నిర్మించిన బ్రిడ్జి వద్ద నిర్వహణ దారుణంగా ఉంది. ఈ బ్రిడ్జి కింద రోజంతా భారీ వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. అలాగే రాత్రి పూట కూరగాయలు, సిమెంటు లారీలు నిలిపివేసి, వేకువజామున వాటి అన్‌లోడింగ్ ప్రక్రియ చేపడుతున్నారు. తర్వాత అక్కడ బయటపడిన వేస్టేజ్ అంతటిని అక్కడే విడిచి పెట్టేస్తున్నారు. దీని వలన ఆ పరిసరాలన్నీ అపరిశుభ్రంగా మారుతున్నాయి. సోంపేట నుంచి కంచిలి వచ్చే మార్గంలో రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద పలు దుకాణాలు ఏర్పాటు చేయడంతోపాటు వాహనాలు నిలిపివేస్తున్నారు. దీని వలన ఆ చుట్టుపక్కల గ్రామాలు, ప్రాంతాల నుంచి వచ్చేవారు అక్కడ వేచి ఉండేందుకు కూడా ఇబ్బందులు పడుతున్నారు. కొర్లాం, జాడుపూడి ఆర్ఎస్ కూడళ్ల వద్ద గల బ్రిడ్జిల కింద కూడా దుకాణాలు శాశ్వత ప్రాతిపదికన ఏర్పాటు చేయడంతో వాహన చోదకులు అవస్థలు పడాల్సి వస్తోంది.


బ్రిడ్జి కింద పేరుకున్న చెత్త


బలియాపుట్టుగ జంక్షన్ వద్ద లైట్లు అమర్చకుండా ఉన్న స్తంభాలు

వెలగని దీపాలు..

జాతీయ రహదారిలోని వివిధ గ్రామాల కూడళ్ల వద్ద సర్వీస్ రోడ్లు, బ్రిడ్జిల వద్ద అప్రోచ్ రోడ్ల నిర్వహణ దారుణంగా ఉంది. మండల కేంద్రం కంచిలి జాతీయ రహదారి పక్కన నిర్మించిన సర్వీస్ రోడ్డులో వీధిలైట్లు వేసేందుకు స్తంభాలు ఏర్పాటు చేసినప్పటికీ వాటికి లైట్లు ఏర్పాటు చేయలేదు. దీంతో రాత్రి వేళ అంధకారం నెలకుంటుంది. అంపురం కూడలి వద్ద సర్వీసు రోడ్డులో ఒకవైపు మాత్రమే వీధిలైట్లు ఏర్పాటు చేయగా, వాటి నిర్వహణ సరిగ్గా లేకపోవడంతో ఎప్పుడు వెలుగుతాయో అయోమయంగా ఉందని స్థానికులు చెబుతున్నారు. జాడుపూడి, జాడుపూడి ఆర్ఎస్, పెద్దకొజ్జిరియా, మకరాంపురం కూడళ్ల వద్ద వీధిలైట్లు ఏర్పాటు చేయకపోవడంతో చీకట్లో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే కంచిలి బ్రిడ్జి మీద ఏర్పాటు చేసిన లైట్లు కూడా వెలగటం లేదు. కంచిలిలో బలియాపుట్టుగ కూడలి వద్ద ప్రధాన రహదారి నుంచి సర్వీస్ రోడ్డును కలిపే ప్రక్రియను చేపట్టకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇలా జాతీయ రహదారుల నిర్వహణ సంస్థ వారు ఈ ప్రాంతంలో సర్వీసురోడ్లు, బ్రిడ్జిలు, వీధిలైట్ల నిర్వహణ సక్రమంగా చేపట్టకపోవడంతో అవస్థలు పడుతున్నామని వాహనదారు లు, స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఈ లోపాలను సరిదిద్దాలని కోరుతున్నారు.

బ్రిడ్జిల నిర్వహణ సక్రమంగా లేదు



జాతీయ రహదారుల వద్ద నిర్మించిన బ్రిడ్జిల నిర్వహణ సక్రమంగా చేపట్టడం లేదు. దీనికి ప్రత్యక్ష నిదర్శనంగా కంచిలి బ్రిడ్జినే చూపించవచ్చు. ఈ బ్రిడ్జి కింద అన్ని వేళల్లో భారీ వాహనాలు పార్కింగ్ చేయడం వలన బస్సులు, ఇతర వాహనాలు రాకపోకలు సాగించడానికి ఇబ్బందికరంగా ఉంది. ఇక్కడ బ్రిడ్జి కింద, బ్రిడ్జిపైన, సర్వీసు రోడ్డులో ఏర్పాటు చేసిన వీధిలైట్లు వెలగకపోవడంతో రాత్రుళ్లు వాహనదారులు అవస్థలు పడుతున్నారు. వీటి నిర్వహణ సక్రమంగా చేయకపోతే దీని నిర్వహణ కోసం ఎన్‌హెచ్ఏఐ. కేటాయిస్తున్న నిర్వహణ నిధులు ఏమౌతున్నాయో అధికారులు దర్యాప్తు చేయాలి.

–సంజయ్‌కుమార్ శర్మ, కంచిలి

అధ్వానంగా నిర్వహణ



జాతీయ రహదారుల నిర్వహణ అధ్వానంగా ఉంది. ఈ ప్రాంతంపై సంబంధిత సంస్థ నిర్లక్ష్యం వహిస్తోంది. నిర్వహణ కోసం కేటాయిస్తున్న నిధులు ఏమౌతున్నాయో అర్థం కావడం లేదు. బ్రిడ్జిలు, సర్వీసు రోడ్ల నిర్వహణ తీసికట్టుగా ఉంది. బలియాపుట్టుగ గ్రామ కూడలి వద్ద స్తంభాలు వేసి లైట్లు అమర్చడం మరిచారు.

–కొల్లి ఈశ్వరరావు, ఏఎంసీ మాజీ చైర్మన్, కంచిలి


బలియాపుట్టుగ కూడలి వద్ద సర్వీసు రోడ్డును సరిగ్గా కలపని దృశ్యం

10న గురుపౌర్ణమి పూజలు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ శివాజీనగర్‌లోని షిర్డీసాయిబాబా మందిరం వద్ద ఈ నెల పదో తేదీన గురుపౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త దువ్వాడ శ్రీధర్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆ రోజు ఉదయం ఐదు గంటల నుంచి ప్రధాన అర్చకులు ధర్మపురి వాయునందన శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ ఉంటుందన్నారు.

శక్తియాప్‌పై అవగాహన


మాట్లాడుతున్న సీఐ సూర్యనారాయణ

కాశీబుగ్గ: కాశీబుగ్గలోని ప్రజ్ఞ కళాశాలలో శక్తి యాప్‌పై పోలీసులు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. పోక్సో చట్టంపై గురించి వివరించారు. చెడు వ్యసనాలకు బలికావద్దని హితవు పలికారు. బాగా చదువుకొని ఉజ్వల భవిష్యత్‌ను తీర్చిదిద్దుకోవాలన్నారు. కార్యక్రమంలో కాశీబుగ్గ సీఐ సూర్యనారాయణ, ఎస్సై రవికుమార్ ఉన్నారు.

కొబ్బరి మొక్కలు పంపిణీ

కంచిలి: ఉద్యానశాఖ ద్వారా అమలు చేస్తున్న పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఉద్యానశాఖ ఏడీ కె.చిట్టిబాబు అన్నారు. పెద్దశ్రీరాంపురం గ్రామంలో బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా అక్కడి రైతులకు పంపిణీ చేసిన కొబ్బరి మొక్కలు నిర్వహణను స్వయంగా పరిశీలించి అవసరమైన సలహాలిచ్చారు. ఆర్‌అండ్‌ఆర్ ప్రోగ్రాం కింద రైతులకు కొబ్బరి మొక్కలను పంపిణీ చేశారు. ఉద్యానశాఖ అధికారిణి పి.మాధవీలత, హెచ్‌ఈవో బాలరాజు, వీహెచ్‌ఏ గంగరాజు ఉన్నారు.

చందాలు వేసుకుని.. జంగిల్ క్లియర్ చేసి..


పిచ్చిమొక్కలు తొలగిస్తున్న వాకర్స్‌క్లబ్ సభ్యులు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలోని నెహ్రూ పార్కు ముత్యాలమ్మ కోనేరుపై మున్సిపాలిటీ నిర్లక్ష్యం వహించింది. దీంతో ఇటువైపు వచ్చేందుకు ఎవరూ సాహసించడం లేదు. ఈ పరిస్థితిలో స్థానిక వాకర్ సభ్యులు ముందుకొచ్చారు. చందాలు వేసుకొని.. పార్కును శుభ్రం చేయాలని సంకల్పించారు. బుధవారం జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టి ఆదర్శంగా నిలిచారు.

సస్యరక్షణ చర్యలతో మెరుగైన దిగుబడి

కవిటి: వరిసాగులో సమగ్ర సస్యరక్షణ చర్యలు పాటించడం ద్వారా మెరుగైన దిగుబడులు సాధ్యమని మండల వ్యవసాయాధికారి పి.శ్రీదేవి అన్నారు. జగతి, కరాపాడు రెవెన్యూ గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతుల వరినారుమడి క్షేత్రాలను, పచ్చిరొట్ట పైర్ల సాగు స్థితిగతులను బుధవారం పరిశీలించారు. రైతులకు అవసరమైన సాంకేతిక సూచనలను అందించారు. వరి నారుమడులు పరిశీలించారు. రైతులు పొలం గట్లపై కందిసాగు, బెండ, చిక్కుడు వంటి కూరగాయాల సాగు చేపట్టడం మంచిదని సూచించారు. ఏఈవో బి.శ్రీకల్యాణ్, వీఎఫ్ఏ నీలవేణి ఉన్నారు.

ఇవేమి పనులు!


టెక్కలి సమీపంలో వంశధార కాలువ గట్టుపై జంగిల్ క్లియరెన్స్ చేస్తున్న దృశ్యం

- అక్కడ నీరు విడిచిపెట్టారు.. ఇక్కడ పనులు చేస్తున్నారు..!
- ప్లాన్ ప్రకారం సాగు నీటి కాలువలపై జంగిల్ క్లియరెన్స్
- నీరు విడిచే సమయంలో జంగిల్ క్లియర్ చేయడంపై రైతుల మండిపాటు

టెక్కలి: ఖరీఫ్ ఆరంభమై వ్యవసాయ పనులకు రైతులు సిద్ధమవుతున్న నేపథ్యంలో బుధవారం గొట్టాబ్యారేజ్ వద్ద వంశధార కుడి, ఎడమ ప్రధాన కాలువలకు సాగు నీటిని విడ్చిపెట్టారు. అయితే అక్కడ సాగు నీరు విడిచిపెట్టిన సమయంలో టెక్కలి నియోజకవర్గంలో పలుచోట్లు సాగు నీటి కాలువల వద్ద జంగిల్ క్లియరెన్స్ పనులు చేయడంపై రైతులు మండిపడుతున్నారు. వేసవి కాలంలో చేయాల్సిన పనులు ఇప్పుడు సాగు నీరు విడిచిపెట్టే సమయంలో చేస్తుండడంపై అధికారుల వైఖరిపై పెద్ద ఎత్తున ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. టెక్కలి సమీపంలో ప్రధాన ఎడమ కాలువతో పాటు మరికొన్నిచోట్ల ఆదరా బాదరాగా జంగిల్ క్లియరెన్స్ పనులు చేస్తున్నారు. నౌపడ సమీపంలో కొన్నిచోట్ల సాగు నీటి కాలువల వద్ద జంగిల్ క్లియరెన్స్ పనులు చేయడం కనిపించింది. టెక్కలి నియోజకవర్గంలో సాగునీటి కాలువలపై ఆధారపడి సుమారు 44,142 ఎకరాల్లో సాగు చేస్తున్న సంగతి తెలిసిందే. సాగు నీటి కాలువల్లో పూర్తి స్థాయిలో పూడికలు తొలగించకపోగా, వేసవి కాలంలో చేయాల్సిన జంగిల్ క్లియరెన్స్ ఇప్పుడు చేస్తుండడం అనుమానాలకు తావిస్తోంది. ఇదంతా వంశధార అధికారులు పక్కా ప్రణాళిక ప్రకారం చేస్తున్న పనులేనని పెద్ద ఎత్తున విమర్శలు చోటు చేసుకుంటున్నాయి. ఆఘమేఘాలపై చేస్తున్న పనులతో నిధులు పక్కదారిపట్టే అవకాశం ఉండడంతోపాటు.. సక్రమంగా పనులు చేసేందుకు అవకాశం లేదని రైతులు అంటున్నారు.


టెక్కలి సమీపంలో పూర్తిగా పూడికలు తొలగించని దృశ్యం

ప్రజా ప్రతినిధులను గౌరవించాలి

- ఎమ్మెల్సీ రామారావు
- సోంపేట మండల సమావేశం


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామారావు

సోంపేట: ప్రజలచే ఎన్నుకోబడిన స్థానిక ప్రజా ప్రతినిధులను మండల, గ్రామస్థాయి అధికారులు గౌరవించాలని ఎమ్మెల్సీ నర్తు రామారావు కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో సీహెచ్ ఈశ్వరమ్మ ఆధ్వర్యంలో ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్ అధ్యక్షతన మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బుసాభద్ర, గొల్లూరు, సోంపేట, జింకిభద్ర తదితర గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు మాట్లాడుతూ.. గ్రామస్థాయిలో జరిగే సమావేశాలకు తమకు కనీసం సమాచారం కూడా ఇవ్వడం లేదన్నారు. గ్రామంలో అధికార పార్టీ కార్యకర్తలు చెప్పినట్లు స్థానిక అధికారులు వినడం హాస్యాస్పదంగా ఉందన్నారు. విత్తనాలు, పుస్తకాల పంపిణీ సమయంలో తమకు సమాచారం లేకపోవడం దారుణమన్నారు. బేసి రామచంద్రాపురంలో నిర్మించిన చెత్తతో సంపద తయారీ కేంద్రం బిల్లులు అందలేదని సర్పంచ్ బుద్దాన రోహిణి సమావేశం దృష్టికి తెచ్చారు. వైస్ ఎంపీపీ గురాల శ్రీను, సోంపేట ఎంపీటీసీ సభ్యుడు పాడుగు కామేష్ మాట్లాడుతూ.. రైతులు వరి విత్తనాలు వేసి 15 రోజులైనప్పటికీ వర్షాల్లేకపోవడంతో విత్తనాలు మొలకెత్తుతాయో లేదో అని రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో వ్యవసాయాధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని, స్వల్పకాలిక విత్తనాలు సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనికి వ్యవసాయాధికారి బి.నర్సింహమూర్తి మాట్లాడుతూ.. ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధుల దృష్టికి సమస్యను తీసుకెళ్తానని పేర్కొన్నారు. సోంపేట ఎంపీటీసీ సభ్యులు పాడుగు కామేష్, ధర్మారావు మాట్లాడుతూ.. స్థానికంగా కాలువలు ఆక్రమణకు గురయ్యావని.. అధికారులు స్పందించి వాటిని తొలగించాలన్నారు. ఎంపీపీ నిమ్మన దాస్ మాట్లాడుతూ.. అధికారులు ప్రజా ప్రతినిధులు తెలియజేస్తున్న సమస్యల పరిష్కరించడానికి కృషి చేయాలన్నారు. పంచాయతీ, మండల పరిధిలో అభివృద్ధి పనులు పూర్తయిన వాటికి బిల్లులు చెల్లించే విధంగా ఎంబుక్‌లు పూర్తి చేసి బిల్లులు అందజేయాలన్నారు. ప్రజా ప్రతినిధులను గౌరవించడంతోపాటు పంచాయతీ పరిధిలోని ప్రతీ సమాచారాన్ని తెలియజేయాలని అధికారులకు సూచించారు. ఎమ్మెల్సీ రామారావు మాట్లాడుతూ.. గ్రామస్థాయి ప్రజా ప్రతినిధులను గౌరవించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ప్రజలు ఎన్నుకున్న ప్రజా ప్రతినిధులను గౌరవించక పోతే ప్రజాస్వామ్యాన్ని నిర్వీర్యం చేసినట్లేనని పేర్కొన్నారు. గత ప్రభుత్వం హయాంలో ప్రతీ ఒక్కరిని గౌరవించడం జరిగిందని గుర్తు చేశారు. అర్హులైన వారందరికీ తల్లికి వందనం నిధులు జమ చేయాలని, లేదంటే వారి తరఫున తాము పోరాటం చేస్తామన్నారు. సమావేశంలో తహసీల్దార్ బి.అప్పలస్వామి, విద్యాశాఖాధికారులు జోరాడు, కృష్ణంరాజు, జేఈలు ధనుంజయం, రమేష్, ఐసీడీఎస్ ఏవో వసుంధరదేవి, ఏపీవో ప్రమీల, ప్రజా ప్రతినిధులు పాతిన శేషగిరి, పొందూరు గున్నయ్య, యర్ర రజనీ, టి.పద్మావతి, శంకరరావు పాల్గొన్నారు.

వైద్యులను గౌరవించాలి


డాక్టర్ నిమ్మన దాస్ దంపతులను సన్మానిస్తున్న ఐఎంఏ ప్రతినిధులు

సోంపేట:

వైద్యులు కనిపించే దైవంతో సమానమని, వారిని అందరూ గౌరవించాలని వక్తలు అన్నారు. సోంపేట ఐఎంఏ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రాజేంద్రప్రసాద్, డాక్టర్ రామకృష్ణల అధ్యక్షతన జాతీయ వైద్యుల దినోత్సవాన్ని మంగళవారం రాత్రి నిర్వహించారు. డాక్టర్ బి.పి.ఎ న్.చంద్రరాయ్ చిత్రపటానికి వైద్యులు నివాళులర్పించారు. వైద్యవృత్తికి ఆయన చేసి న సేవలు కొనియాడారు. వైద్య దినోత్సవం సందర్భంగా శ్యామల మెమోరియల్ ఆస్పత్రి వ్యవస్థాపకులు పైడిశెట్టి రమేష్, చక్రధర నర్సింగ్ హోమ్ వ్యవస్థాపకులు, ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్ దంపతులను సోంపేట ఐఎంఏ ఆధ్వర్యంలో దుశ్శాలువతో సత్కరించారు. జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందజేసి సేవల ను కొనియాడారు. ఐఎంఏ ప్రతినిధులు డాక్టర్ కృష్ణమూర్తి, ప్రధాన శివాజీ, మూల జోగినాయుడు, పెద్దింటి దుర్యోధన, తుంగాన వెంకటేష్, మంచు ప్రదీప్, డాక్టర్ వివేక్ పాల్గొన్నారు.

అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి


మాట్లాడుతున్న వసంతకుమార్

పలాస: మహిళలకు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో కె.వసంతకుమార్ అన్నారు. పలాస మండల పరిషత్ కార్యాలయంలో పలాస, నందిగాం, మెళియాపుట్టి మండలాల మహిళా సర్పంచులకు మహిళా సాధికారితపై అవగాహన కల్పించేందుకు శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముందుగా పలాస డివిజన్‌లో ఉన్న మహిళా సర్పంచులకు ఒక్కో నియోజకవర్గానికి మూడు రోజులు పాటు శిక్షణ ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. పాలన ఎలా జరపాలి, ప్రజలతో ఎలా ఉండాలి, పంచాయతీ అభివృద్ధి ఎలా సాధించాలో మెలకువలు తెలుసుకోవాలని చెప్పారు. ప్రతి విషయాన్ని అవగాహన చేసుకొని పాలన చేయాలన్నారు. ప్రభుత్వం మహిళలకు ప్రత్యేక స్థానం కల్పిస్తుందని చెప్పారు. డీఆర్పీలు జ్యోతి, శ్రీనివాస్, కామరాజు, ఎన్.మన్మథరావులు శిక్షణ ఇచ్చారు. డిప్యూటీ ఎంపీడీవో మెట్ట వైకుంఠరావు, ఏవో అనురాధ, సీనియర్ అసిస్టెంటు మన్మథరావు, డీపీఆర్సీ కోఆర్డినేటర్ పేరాడ ఆనందరావు పాల్గొన్నారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుదాం


మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి

కవిటి: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా వ్యాధులను అరికట్టవచ్చునని ఎంపీడీవో కె.శ్రీనివాసరెడ్డి అన్నారు. ఈ మేరకు తన కార్యాలయంలో పంచాయతీరాజ్ ఇంజినీరింగ్, గ్రామీణ నీటిసరఫరాశాఖలు సంయుక్తంగా బుధవారం నిర్వహించిన స్టాప్ డయేరియా సమావేశంలో ఆయన మాట్లాడారు. డయేరియా ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతీ గ్రామాన్ని సందర్శించి నీటివనరుల క్లోరినేషన్, బ్లీచింగ్ చల్లే కార్యక్రమం, ఓవర్ హెడ్ ట్యాంకులు శుభ్రపర్చడం, నీటి స్వచ్ఛత పరీక్షల నిర్వహణకు సంబంధించి షెడ్యూల్ సిద్ధం చేసి సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ల పర్యవేక్షణలో పనులు పూర్తి చేయాల్సి ఉందన్నారు.

నూతన కార్యవర్గం



సోంపేట మండల రజక సంఘం నూతన కార్యవర్గం బుధవారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. అధ్యక్షుడిగా రంజిత్‌కుమార్, ఉపాధ్యక్షులుగా తురాల దేవేంద్ర, కొల్లూరు జనార్ధన, కార్యదర్శిగా కొవ్వూరు రాజా, కోశాధికారులుగా నిమ్మాడ మోహనరావు, మామిడిపల్లి గాంధీ నియమితులయ్యారు. సంఘ సభ్యుల సమస్యల పరిష్కారానికి తమంతు కృషిచేస్తామని నూతన కార్యవర్గం పేర్కొన్నారు. –సోంపేట

న్యాయం చేయాలి

అగ్రి గోల్డ్ బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు వై.కోదండరావు, ఎం.జయసింహా, పి.ఆరేలమ్మ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం టెక్కలి సమీపంలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. బాధితులకు న్యాయం జరిగే విధంగా ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో అసోసియేషన్ సభ్యులు గుడ్ల రవికుమార్, అప్పలస్వామి, ఎం.రామారావు, జగదీశ్వరరావు, తిరుపతిరావు, జగబందు, నాగేశ్వరరావు, పాపినాయుడు, ముకుందరావు పాల్గొన్నారు. –టెక్కలి



ఆలయ హుండీ లెక్కింపు



కంచిలి మండల కేంద్రంలో కొలువై ఉన్న కంచమ్మతల్లి అమ్మవారి ఆలయంలో భక్తులు వేసిన కానుకల హుండీని బుధవారం సాయంత్రం లెక్కించారు. 38,473 రూపాయలు విరాళాలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. లెక్కింపులో ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు వంకల సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. –కంచిలి